www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 డిసెంబర్ 2025

రాజంపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట : ప్రజాభీష్టం మేరకే రాజంపేట నియోజకవర్గాన్ని కడప జిల్లాలో కలిపారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత జిల్లా కేంద్రమేనని, పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించక తప్పదని పేర్కొన్నారు. అన్ని పరిస్థితులు అధ్యయనం చేశాకే రాజంపేటను కడపలో కలిపామన్నారు. రాజంపేట అభివృద్ధి పైనే ప్రధాన దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. జిల్లా పునర్విభజన విషయంలో గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దే ప్రక్రియలోనే కడప జిల్లాలో రాజంపేట చేరిందన్నారు. రాజంపేట రెవెన్యూ డివిజన్ ఎక్కడికి పోదని తెలియజేశారు. రాజంపేటను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు టిడిపి శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, టిడిపి రూరల్ మండలాధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మందా శ్రీనువాసులు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి కరీమ్, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారాజు, కౌన్సిలర్ గుణకల చిన్న పాల్గొన్నారు.

కడప, అన్నమయ్య జిల్లాల పునర్విభజన

నోటిఫికేషన్ విడుదల

జిఒ ఎంఎస్ 529 జారీ - నేటి నుంచి అమల్లోకి..



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాల పునర్విభజన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. కడప, అన్నమయ్య జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ శాఖ పరిధిలోని ల్యాండ్స్-4 డిపార్టుమెంట్ మంగళవారం జిఒ ఎంఎస్ నెంబర్ 529 పేరిట ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లాలోని 36 మండలాలకు, పాత అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ పరిధిలోని ఆరు మండలాలను కలుపుతూ ఉత్తర్వుల్లో పేర్కొంది. కడప జిల్లా 40 మండలాల విస్తీర్ణంతో ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు యాక్ట్-1974 సబ్ సెక్షన్-1 కింద సెక్షన్-3, సబ్‌సెక్షన్ (2) పరిధిలోని సెక్షన్-3 ప్రకారం ఏర్పాటుకు కసరత్తు చేసినట్లు పేర్కొంది. 1974 యాక్ట్ నెంబర్-7 సబ్ సెక్షన్ (6)లో పేర్కొన్న విధంగా పాలనాసౌలభ్యం మేరకు ప్రతిపాదించినట్లు తెలిపింది. 2025 డిసెంబర్ 31 నుంచి కడప, అన్నమయ్య జిల్లాల సరిహద్దులు అమల్లోకి రానున్నట్లు ప్రస్తావించింది. కడప జిల్లా పరిధిలోని 40 మండలాలతో జాబితాను విడుదల చేసింది. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మైదుకూరు, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేల్, గోపవరం, బ్రహ్మంగా రిమఠం, అట్లూరు మండలాలు ఉంచింది. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని కడప, కమలాపురం, వల్లూరు, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, ఒంటిమిట్ట, సిద్ధవటం, ఖాజీపేట మండలాలు ఉన్నట్లు తెలిపింది. జమ్మల మడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని జమ్మల మడుగు, పెద్దము డియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం, ప్రొద్దుటూరు, రాజుపాలెం, ఎర్రగుంట్ల, దువ్వూరు, చాపాడు, సింహాద్రిపురం, లింగాల, తొండూరు, పులివెందుల, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాలను ఉంచింది. పాత అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ పరిధిలోని రాజంపేట, నందలూరు, వీరబల్లి, టి.సుండుపల్లి మండ లాలను కలుపుతూ సరిహద్దులను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2025 డిసెంబర్ 31 నుంచి అమల్లోకి రానున్నాయని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.

భూ సమస్యలను పరిష్కరించాం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఈ ఏడాది సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు నాలుగు నెలల కాలంలో జిల్లాలో 15 మండలాలకు సంబంధించి 103.35 ఎకరాల 22ఎ భూ సమస్యలను పరిష్కరించామని, 22 ఎ భూ సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాలకు సంబంధించి 51 లబ్ధిదారులకు 103.35 ఎకరాలకు సంబంధించిన 22 ఎ భూములకు సంబంధించిన 31 ఎన్ఒసిలను జారీ చేశామన్నారు. జిల్లాలో 22ఎ భూముల పరిష్కారం కోసం ఇటీవలే ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం రోజు 12 మండలాలకు సంబంధించి 39 లబ్ధిదారులకు గాను 73.34 ఎకరాలకు సంబంధించి ఎన్ఒసిలను జారీ చేశామన్నారు. నాలుగు నెలల కాలంలో రాయచోటి డివిజన్‌కు సంబంధించి 4 మండలాలలో 05 మంది లబ్ధిదారులకు 13.5 ఎకరాలకు సంబంధించిన 22ఏ భూములకు సంబంధించిన 5 ఎన్ఒసిలను జారీ చేశామన్నారు. నాలుగు నెలల కాలంలో మదనపల్లె డివిజన్‌కు సంబంధించి 6 మండలాల్లో 28 మంది లబ్ధిదారులకు 53.74 ఎకరాలకు సంబంధించిన 22 ఎ భూములకు సంబంధించిన 18 ఎన్ఒసిలను జారీ చేశామన్నారు. నాలుగు నెలల కాలంలో రాజంపేట డివిజన్‌కు సంబంధించి 5 మండలాలలో 21 మంది లబ్ధిదారులకు 36.12 ఎకరాలకు సంబంధించిన 22ఎ భూములకు సంబంధించిన 08 ఎన్ఒసిలను జారీ చేశామన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం అన్నమయ్య జిల్లాలో స్పెషల్ డ్రైవ్ ఇటీవలే ప్రారంభించామని సమస్యలన్నింటిని పరిష్కరించే వరకు స్పెషల్ డ్రైవర్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

బాధితుడికి ఎన్ఒసి సర్టిఫికెట్ ఇస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

యువత రాజకీయాల్లోకి రావాలి : కాంగ్రెస్

మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

యువత రాజకీయాల్లోలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ జోనల్ రిటర్నింగ్ ఆఫీసర్ కరూర్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లి రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లాలో యువజన కాంగ్రెస్ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ రాయలసీమ జోనల్ రిటర్నింగ్ ఆఫీసర్ కరూర్ సతీష్‌కుమార్, అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజుల భాస్కర్ యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ యువతకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాబోయే యువజన కాంగ్రెస్ ఎన్నికల కోసం ఈ మెంబర్ షిప్ డ్రైవ్ చేపట్టామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారందరూ కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం తీసుకొని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్, డిసిసి అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ దుగ్గనపల్లి సురేంద్రరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు దర్బార్, పట్టణ అధ్యక్షులు బాబా సర్దార్, డిసిసి జనరల్ సెక్రెటరీ సమీరుద్దీన్, సేవాదళ్ అమీర్ బాషా, రాజంపేట నియోజకవర్గ ఎస్‌సి సెల్ చైర్మన్ భాస్కర్, శరత్ కుమార్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి,ద్వారక, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాను సురక్షితంగా తీర్చిదిద్దుతాం : ఎస్‌పి

మాట్లాడుతున్న ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

ప్రజాశక్తి-రాయచోటి

సామాన్య ప్రజల రక్షణే ప్రథమ ధ్యేయంగా, అత్యాధునిక సాంకేతికతను జోడించి జిల్లాను సురక్షితంగా తీర్చిదిద్దుతున్నామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'వార్షిక నేర సమీక్షా సమావేశం-2025'లో ఆయన జిల్లా పోలీసులు సాధించిన సంచలన విజయాలను, ఏడాది కాలపు ప్రగతిని మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో నివాసం ఉంటున్న ఇద్దరు టెర్రరిస్టులను తమిళనాడు ఎటిఎస్ సహకారంతో అరెస్ట్ చేసి, భారీ ముప్పును తప్పించారన్నారు. మదనపల్లిలో నిర్వహించిన 'డిజిటల్ అరెస్ట్' కేసులను ఛేదించి, బాధితులు పోగొట్టుకున్న రూ.77 లక్షల నగదును ముద్దాయిల ఖాతాల్లో గుర్తించి, కోర్టు ద్వారా తిరిగి ఇప్పించే చర్యలు చేపట్టామని వివరించారు. మదనపల్లిలో మహిళ మృతికి కారణమైన కిడ్నీ రాకెట్‌పై ఉక్కుపాదం మోపి, సంబంధిత ఆసుపత్రిని సీజ్ చేయడమే కాకుండా 9 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. గంజాయి, జూదంపై ముందస్తు దాడులు, బైండోవర్ కేసుల వల్ల హత్యలు 43 శాతం తగ్గాయిన్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించడం వల్ల కేసుల నమోదులో 2 శాతం పెరుగుదల నమోదైందని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, 'ఫేస్ వాష్ అండ్ గో' వంటి కార్యక్రమాల వల్ల రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించామని తెలిపారు. క్రీడల వల్ల సిబ్బందిలో ఉత్సాహం పెరిగి మరింత సమర్థవంతంగా పనిచేస్తారనొ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన పోలీసులకు ఎస్‌పి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే ఐపిఎస్, రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్ కృష్ణమోహన్, మదనపల్లి డిఎస్‌పి యస్ మహేంద్ర, పలువురు ఎపిపిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హద్దు దాటితే.. లాకప్పే..: నూతన సంవత్సర వేడుకల వేళ జిల్లాలో అల్లర్లు సృష్టించినా, అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి హెచ్చరించారు. డిసెంబరు 31 రాత్రి నిమిత్తం పోలీసు శాఖ ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ నిబంధనలకు లోబడి ఆనందోత్సాహాల మధ్య కొత్త ఏడాదికి స్వాగతం పలకాలని కోరారు. వేడుకల నిర్వహణలో ఏ చిన్న అవాంఛనీయ సంఘటన జరిగినా నిర్వాహకులదే బాధ్యతని ఎస్‌పి స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తామన్నారు. మద్యం దుకాణాలు, బార్లు, హోటళ్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికే మూసివేయాలన్నారు. రాత్రి 10:30 గంటల తర్వాత మైకులకు, మ్యూజిక్ సిస్టమ్స్‌కు అనుమతి లేదన్నారు. ఈవెంట్ల పేరుతో అశ్లీల నృత్యాలు, అసభ్యకర చేష్టలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, పేకాట ఆడటం నిషిద్ధమని పేర్కొన్నారు. ప్రధాన రహదారులపై, కూడళ్లలో కేక్ కటింగ్‌లు చేసి ప్రజలకు అంతరాయం కలిగించ వద్దని సూచించారు.

మహమ్మద్‌ను సన్మానిస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

మహమ్మద్ సేవలు చిరస్మరణీయం : డిఇఒ

ప్రజాశక్తి- రాయచోటి: ఉర్దూ సాహిత్య రంగానికి షేక్.మహమ్మద్ హాషిం అందించిన సేవలు ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలోని డైట్‌లో ఆధునిక ఉర్దూ సాహిత్యం అంశంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ షేక్ మహమ్మద్ హాషిం తన రచనల ద్వారా పాఠకులను ఆలోచింపజేసేలా సమాజానికి స్పష్టమైన సందేశం అందించేలా సాహిత్య సేవలు అందించారని కొనియాడారు. ఉర్దూ భాషా వికాసానికి ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం డాక్టరేట్ పొందిన షేక్ మహమ్మద్ హాషింను పూలమాలలు, దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎఎంఒ అసాదుల్లా బాష , అన్నమయ్య జిల్లా రూట ప్రెసిడెంట్ సభాతుర్రహ్మాన్, ప్రధాన కార్యదర్శి జాఫర్ ఉద్దీన్, గణిత సహ ఉపాధ్యాయులు సునీర్, ప్రముఖ ఉర్దూ కవి యూనుస్ తయ్యబ్, సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆఫ్తాబ్ ప్రధాన కార్యదర్శి అమీర్ అలీ, సోషల్ యాక్టివిటీస్ట్ ఆరిఫ్,అధ్యాపకులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

నెరవేరిన 114 ఏళ్ల ప్రజల ఆకాంక్ష : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లె ప్రాంత ప్రజల 114 ఏళ్ల ఆకాంక్షను నెరవేరుస్తూ మదనపల్లెని జిల్లా కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు జరుపు కునేందుకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్, మాల మహానాడు రాష్ట్ర నేత యమలా సుదర్శనం, బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్, బహుజన సేన నేత శ్రీచందు, వాల్మీకి సంఘం నేత హరికృష్ణ, ఎమ్మార్పీఎస్ నేత నరేంద్ర మాదిగ, ఆరేటి వాసు, ఫోర్డ్ లలి తమ్మ, చైతన్య అనాథ బాలల పునరావసకేంద్ర నిర్వాహకులు ఆనందన్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగేంద్ర కుమార్, విద్యార్థి విభాగం నేత లక్ష్మీపతి, తెలుగుదేశం నాయకులు పోతబోలు సుధాకర్, నాగూర్ వలి, ఎస్ఆర్.షంషీర్ పాల్గొన్నారు.

జిల్లా సాకారం కూటమి ప్రభుత్వానిదే : ఆర్‌జె

నిమ్మనపల్లి: మదనపల్లె జిల్లాను సాకారం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, జిల్లా ఉద్యమంలో ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకుల పోరాటం మరువలేమని రాజంపేట పార్లమెంట్ మాజీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కూటమి నాయకులు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిని మండల అధ్యక్షులు వెంకటరమణ, రాజన్న, రెడ్డెప్పరెడ్డి, మునిరత్న, శ్రీపతి, మాజీ సర్పంచ్ రఫీ, రమణ, లక్ష్మన్న, మల్లికార్జున, కొండప్ప, వేణుగోపాల్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంఘాలతో కలిసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సమష్టి పోరాటంతో సాధించుకున్నాం :'ముక్కా'

విజయోత్సవ ర్యాలీలో ఇజెఎసి, జెఎసి, కూటమి నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపేందుకు సమష్టి కృషితోనే సాధించామని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మంగళవారం విజయోత్సవ ర్యాలీని స్థానిక టోల్గేట్ వద్ద నుంచి బస్టాండు కూడలి వరకు ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో కూటమి నాయకులు ముక్కారూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, బత్తిన గంగయ్య యాదవ్, పిసిఎన్ బ్రదర్స్ పలువురు జెఎసి నాయకులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ బొమ్మ వద్ద ముక్కా మాట్లాడుతూ దాదాపు 16 రోజులు సమష్టిగా ఇజెఎసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేసిన కారణంగా ఎట్టకేలకు రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడం ఎంతో సంతోష కరమైన విషయమని పేర్కొన్నారు. టిడిపి యువ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్ కోలాట కార్యక్రమాన్ని నిర్వహించి విజయోత్సవ ర్యాలీలో నిర్వహించారు. ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఇజెఎసి నాయకులు ముత్యాల పెంచలయ్య, ఎస్ఎన్ శ్రీనివాసులు, కె.చంగల్ రాజు, నరసింహారెడ్డి, ఎస్ చంగల్ రాజు, ఎం.తులసి, నారాయణ వర్మ, ఎంవి.కుమార్, శ్రీవర్ధన్‌రెడ్డి, సుకుమార్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలు సేకరించండి

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

జిల్లా కేంద్రం అంశంలో రాయచోటికి ఎవరి మద్దతు లేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడడం దారుణమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా ఎవరు కోరుకోవడం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి రాయచోటి ప్రాంతాన్ని కించపరిచేలా మాట్లాడడం తగదన్నారు. మదనపల్లి జిల్లా ఏర్పాటు ద్వారా రాయచోటి ప్రాంతాన్ని ఒక మూలకు చర్చి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టింది కూటమి ప్రభుత్వమేనన్నారు. రాయచోటిని ఒక కార్నర్‌గా చేసి జిల్లాగా ఉండాలంటే ఎవరు మద్దతు ఇస్తారంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మదనపల్లి జిల్లా ఏర్పాటు కోసం అన్నమయ్య జిల్లాలో రెండు మండలాల విలీనం కోసమే అభ్యం తరాలు కోరిందన్నారు. రాష్ట్రంలో 927 అభ్యర్థనలు వచ్చాయన్నారు. అందులో అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఏమి వచ్చాయి అనేది ఇంతవరకు ప్రకటించ ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటంటే ప్రశ్నించారు. రాయచోటి జిల్లా కేంద్రం విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు ఎందుకు గడువు ఇవ్వలేదు అంటూ ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తామంటూ హెచ్చరించారు. ప్రపం చంలో ఏ దేశంలో అయినా ఉరిశిక్ష పడిన ఖైదీకి చివరి కోరిక అడుగుతారన్నారు రాయచోటి జిల్లా కేంద్రంలో ప్రజలనుండి అభిప్రాయాలు కోరకపోవడం దుర్మార్గమన్నారు. అసెంబ్లీలో కొద్దిరోజుల క్రితమే రాయచోటి గురించి మరొక ప్రాంత ఎమ్మెల్యే మాట్లాడినప్పటి నుండే రాయచోటిపై కుట్ర జరుగుతోందని అర్థమైందన్నారు. మించిపోయింది ఏం లేదని ప్రభుత్వం తుది నోటిఫికేషను వాయిదా వేసి రాయచోటి ప్రాంత ప్రజల అభిప్రాయాలను సేకరించాలన్నారు. అప్పుడే జిల్లా కేంద్రం మార్పుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రీసర్వేపై ఊటుకూరులో గ్రామసభ

ప్రజాశక్తి-రాజంపేట

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో మంగళవారం మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీధర్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ గ్రామ సరిహద్దులపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్లాక్ బౌండరీలు, రైతులకు నోటీసులు జారీ చేయుట గురించి, రీ సర్వే ప్రక్రియ తదితర అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ఊటుకూరు పరిధిలో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్ఒ శివరాజ, సర్వేయర్ సాయి హేమ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా పేరు మార్చొద్దు : బిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చరిత్రను చెరపొద్దు.. మదనపల్లె జిల్లా పేరు మార్చొద్దని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదంతో మదనపల్లిని జిల్లా కేంద్రంగా చేస్తూ అన్నమయ్య జిల్లాగా ప్రకటించడాన్ని హర్షించదగ్గ విషయమే అయినా మదనపల్లి జిల్లాగా పేరు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. మహనీయుడు అన్నమయ్య తాళ్లపాకలో జన్మించారు. ప్రస్తుతం తాళ్లపాక రాజంపేట నియోజకవర్గం, కడపలో కలుస్తున్న కారణంగా కడప జిల్లాకు అన్నమయ్య కడప జిల్లాగానో, లేకపోతే అన్నమయ్య వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు పెడితే సమంజసంగా ఉంటుందన్నారు. ఘన చరిత్ర కలిగిన మదనపల్లిని మదనపల్లి జిల్లాగానే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మదనపల్లి జిల్లా కోసం బిఎస్‌పి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేసిందని గుర్తు చేశారు. మదనపల్లి పేరుతో ఉన్న అనుబంధాన్ని, మదనపల్లి ప్రాంత ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకొని అన్నమయ్య జిల్లా కాకుండా మదనపల్లి జిల్లాగా ప్రకటించాలన్నారు. బుధవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపడతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఎస్పి జిల్లా అధ్యక్షులు మిద్దేపల్లి బాలాజీ పాల్గొన్నారు.

నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి: జనవరి రెండు నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రెవెన్యూ గ్రామసభలలో నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేస్తామని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో రాజకీయ పార్టీ లోగోలు, పేర్లను తీసివేసి ప్రభుత్వ చిహ్నాన్ని కలిగిన పట్టాదారు పాసు పుస్తకాలను రెవెన్యూ గ్రామసభలలో పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు. నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ గురించి అన్ని మండలాల తహశీల్దారులకు, రెవెన్యూ సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

నేడు రాయచోటిలో వైసిపి ర్యాలీ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని తొలగించడంపై ప్రజల మనోభిప్రాయాన్ని తెలియజేసే ఆత్మఘోష ర్యాలీని ఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుండి మదనపల్లికి తరలించాలన్న ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసా గించాలన్న డిమాండ్‌తో ర్యాలీని నిర్వహింప తలపెట్టినట్లు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో జనార్ధన్

ఎవరెస్టు శిఖరం అధిరోహణకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - రాయచోటి/కలకడ

ఎవరెస్టు శిఖరం అధిరోహణకు జిల్లా నుంచి ముగ్గురు వికలాంగ విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్ధన్ తెలిపారు. మంగళవారం తిరుపతి ఎస్‌పి జెఎన్ఎం పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జోనల్ స్థాయి ఎవరెస్టు శిఖరం అధిరోహణ కోసం వికలాంగ విద్యార్థులకు శారీరక దృఢత్వ పరీక్షల కోసం క్రీడా పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్ పుట్‌లలో కలకడ మండలం, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి బి.దిలీప్, పెద్దమండెం మండలం, ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని కె.రామానుజులమ్మ, ఓబులవారిపల్లె మండలం, 8వ తరగతి విద్యార్థి ఎం.నందు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎవరెస్టు శిఖరం అధిరోహణకు ఎంపిక అయ్యారన్నారు. వీరికి నెల రోజుల పాటు కడప గండికోటలో శిక్షణ ఇచ్చి, లడక్‌లో ఆర్మీ వారిద్వారా శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ పోటీల్లో అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి వికాంగుల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్ర మంలో సమ్మిళిత ఉపాధ్యాయులు లక్ష్మి, శోభ, గోపి, రంగస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చలో నమోదు చేసుకోండి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

దేశవ్యాప్తంగా విద్యార్థులలో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'పరీక్షా పే చర్చలో పాల్గొనేందుకు, ప్రధానితో మాట్లాడేందుకు విద్యార్థులు తవ పేర్లను నమోదు చేసుకోవాలని డిఇఒ సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష పే చర్చ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనవచ్చు అన్నారు. పరీక్ష పే చర్చలో పాల్గొనదలచిన వారు innovateindia1. mygov.in వెబ్‌సైట్‌ను సందర్శించి మొబైల్ నంబర్ లేదా జీమెయిల్ ద్వారా ఒటిపితో లాగిన్ అయి తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత మొబైల్ లేదా ఇ మెయిల్ లేనప్పుడు ఉపాధ్యాయుల లాగిన్ ద్వారా వివరాలను నమోదు చేసే సౌకర్యం కూడా ఉందని చెప్పారు. 'పరీక్షా పే చర్చ' పంపిన ప్రశ్నలలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి, వాటిని పంపిన విద్యార్థులతో ప్రధాని మంత్రి ప్రత్యక్షంగా మాటాడుతారని పేర్కొన్నారు. సుమారు 2,050 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా 'పిపిసి కిట్‌లు' బహుమతిగా అందజేయనున్నారన్నారు. విజేతలకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రశంసా పత్రాలు, ప్రధాన మంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్లు విద్యార్థులకు అందించబడతాయన్నారు. ఈ పరీక్షా పే చర్చ నందు పాల్గొనేందుకు జనవరి 11 చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, డిసిఇబి కార్యదర్శి గంగాధర్, డైట్ అధ్యాపకులు వెంకట సుబ్బారెడ్డి, మోహన్ నాయక్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని వాహిదా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

అన్నదానం గొప్పది : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

అన్నదానం గొప్పదని ఎంపిపిల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వంగిమళ్ల పంచాయతీ కావలిగడ విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు, డి.రాచపల్లి, పంచాయతీ పెద్ద మాదిగ పల్లెకు చెందిన మూసనాగ ఆంజనేయులు కుటుంబ సభ్యులు కలిసి ముక్కోటి ఏకాదశి సందర్భంగా పెద్దమాదిగపల్లెలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి మండల వ్యాప్తంగా వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పెద్దమాదిగపల్లె యువకులకు క్రికెట్ కిట్ లంద జేశారు. కార్యక్రమాన్ని కావలిగడ, వంగిమళ్ల, డి రాచపల్లి ప్రజలు పాల్గొన్నారు.

రోడ్లపై వేడుకలు నిషేధం : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి :మాట్లాడుతున్న సిఐ రామచంద్ర

2026 నూతన సంవత్సర వేడుకలు అర్ధరాత్రి రోడ్ల పై జరుపుకోవడం పూర్తిగా నిషేధమని కలికిరి సిఐ కె.రామచంద్ర తెలిపినారు. డిసెంబర్ 31వ తేది రాత్రి 10 గంటల్లోపు వేడుకలు పూర్తి కావాలని, రోడ్ల పై కేకులు కట్ చేసి వేడుకలు జరుపుకు నేందుకు అనుమతి లేదన్నారు. మద్యం తాగి పబ్లిక్ ప్లేస్ లలో గలాటాలకు పాల్పడి, అశాంతి చేష్టలు చేసే ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, డిసెంబర్ 31వ తేది రాత్రి డ్రంక్ డ్రైవ్ గురించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడిపే వారి పై కేసులు నమోదు చేస్తామని, మైనర్లు వాహనాలు నడిపితే, వారి పై మరియు వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అశ్లీల నృత్యాలు, చేష్టలు నిషేధం పై నియమాలు ఖచ్చితంగా పాటించి, ప్రశాంతంగా వేడుకలు జరుపుకొని పోలీస్ వారికి సహకరించాలని, మండల ప్రజలకు ఆయన నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు.**రామాపురం :** నూతన సంవత్సర వేడుకల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివకుమార్ హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి వాహనాలు నడపడం అల్లర్లు సృష్టించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. యువత అత్యుత్సాహంతో ప్రమాదాల బారిన పడకుండ తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రి వేళలో బయటకు పోకుండా మహిళల రక్షణ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం గస్తీ ముమ్మురం చేస్తున్నట్లు తెలిపారు.**వీరబల్లి:** మండలంలో యువకులు ప్రజలు నూతన సంవత్సర సందర్భంగా విందుల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుస్మిత ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలకు యువతకు యువకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ప్రజలు యువకులు మద్యం సేవించి రోడ్ల పైన తిరుగుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

గురు ప్రసాద్‌కు అవార్డుపై హర్షం

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

రాష్ట్రవ్యాప్తంగా విద్యాభివృద్ధికి విశేషంగా దోహదపడుతున్న ముగ్గురు విద్యావేత్తలకు ప్రముఖ ఐసిటి అకాడమీ సంస్థ 'ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డులు' అందజేసింది. ఈ అవార్డుల్లో రెండు ఇంజినీరింగ్ కళాశాలలకు దక్కగా, రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఒక్క డిగ్రీ కళాశాలకు ఈ గౌరవం లభించడం విశేషం. మదనపల్లెకు చెందిన శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్‌కు 'ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డ్' లభించింది. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ మధు మూర్తి, జెఎన్‌టియు కాకినాడ వైస్ ఛాన్సలర్ సిఎస్ఆర్‌కె ప్రసాద్, ఐసిటి అకాడమీ సిఇఒ శ్రీకాంత్ చేతుల మీదుగా గురు ప్రసాద్ అవార్డు స్వీకరించారు.

రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని చిట్వేలిలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్థానిక తహశీల్దార్ సుందర, గ్రామ ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వరరెడ్డి అధ్యక్షతన రీసర్వే పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీసర్వే అనేది భూమి శాశ్వత హక్కు పొందడమని, దీని గురించి ఎవరికైనా అనుమానాలు ఉన్నా సంప్రదించవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రమణ, మండల సర్వేయర్ త్యాగరాజు, చౌడవరం మురళి రెడ్డి, విఆర్వో సునీల్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, నరసింహ, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

ఆదాయాన్నిచ్చే మిల్లెట్ సాగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మిల్లెట్ సాగు రైతులకు ఆదాయాన్నిస్తుందని వ్యవసాయ కళాశాల డీన్ రామారావు తెలిపారు. స్థానిక ఉద్యాన కళాశాలలో మంగళవారం ఎస్‌సి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర పోషక నిర్వహణ, సేంద్రియ సాగు పద్ధతులను వివరించారు. జీవ ఎరువులు, జీవ ఆధారిత ఇన్‌పుట్ల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి, రసాయన ఎరువులపై ఆధారపడడం తగ్గుతుందన్నారు. ఆహార భద్రత పెరుగుతుందన్నారు. హార్టీ మిల్లెట్ ప్రాజెక్టు ద్వారా రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ శరత్‌కుమార్ రెడ్డి, డాక్టర్ నాగలక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్, ఎపి కోస్ సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - లింగాల

రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఆన్‌లైన్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ సూచించారు. మండల పరిధిలోని వెలిదండ్ల రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఇ-పంట నమోదు ప్రక్రియను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. నమోదులో ఎలాంటి అవకతవకలకు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సకాలంలో పంట నమోదు పూర్తి చేయాలన్నారు. పంట నమోదు వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వంటి నష్టం సంభవిస్తే ప్రభుత్వ పథకాలు అందుకుంటాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు తమ పొలంలో సాగు చేసిన పంటను నమోదు చేసుకోవాలని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా సిబ్బంది జగదీశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జగన్ ఆర్థిక నేరస్తుడు కాబట్టే పొత్తుల్లేవు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ జగన్ ఆర్థిక నేరస్తుడు కాబట్టే దేశంలో ఏ పార్టీ వైసిపితో పొత్తు పెట్టుకోదని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి వై.ఎస్.జీవీఎల్లు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం కడపలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ... వైసిపి మాత్రమే దేశంలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని గొప్పగా చెప్పారన్నారు. వాస్తవానికి మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆర్థిక నేరస్తుడన్నారు. ఈ కారణంగా ఏ పార్టీతో ఎవరూ పొత్తు పెట్టుకోలేదని విమర్శించారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి జగనన్న ఇళ్లు, మార్కెట్, సోమలవారిపల్లె బ్రిడ్జి ఇలా ఏ ఒక్కటి పూర్తి చేయలేదని, అందుకే ప్రజలు ఆయనను ఓడించారన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా టిడిపి కార్యదర్శి తలారి పుల్లయ్య, అధికార ప్రతినిధి మంచపాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'మిట్స్'లో క్వాలిటీ మైండ్‌సెట్ వర్క్‌షాప్

ప్రజాశక్తి -మదనపల్లె టౌన్

మాట్లాడుతున్న వినోత్‌కుమార్ బోజరాజ

మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మిట్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (ఐఇఐ) స్టూడెంట్ చాప్టర్ సహకారంతో 'క్వాలిటీ మైండ సెట్ అండ్ టెస్ట్ ఆటోమేషన్' అనే అంశంపై రెండు రోజుల పాటు హాండ్స్‌ఆన్ వర్క్‌షాప్‌ను నిర్వహించారని విసి డాక్టర్ యువరాజ్ తెలియచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నైకి చెందిన సిజిఐ ఇన్‌కార్పొరేషన్ కంపెనీ కన్సల్టింగ్ డెలివరీ మేనేజర్ వినోత్ కుమార్ బోజరాజ పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా వినోత్‌కుమార్ బోజరాజ మాట్లాడుతూ ప్రతి సాఫ్ట్‌వేర్ అభివృద్ధి దశలో ముందుగానే నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. డెవలపర్స్, టెస్టర్స్, బిజినెస్ అనలిస్ట్స్ సమన్వయంతో పనిచేస్తే ఉత్తమ నాణ్యత గల ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి ప్రారంభ దశ నుంచే క్వాలిటీ మైండ్‌సెట్‌ను పాటించడం ద్వారా లోపాలు తలెత్తకుండా ముందుగానే నివారించవచ్చని, దీనివల్ల వినియోగదారులకు నమ్మకమైన, సురక్షితమైన మరియు స్థిరమైన సాఫ్ట్‌వేర్‌ను అందించవచ్చని వివరించారు. చివరి దశలో మాత్రమే టెస్టింగ్ చేయకుండా ప్రతి డెవలప్‌మెంట్ దశలో నాణ్యతను కాపాడితే సమయం, ఖర్చు రెండూ తగ్గుతాయని పేర్కొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

రైల్వేకోడూరు : క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము 1:30 నుంచే భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి తరలివచ్చారు. క్యూ లైన్లు భక్తులతో నిండిపోయి ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.సౌమ్యనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడు భక్తుల సమక్షంలో లక్ష తులసి అర్చన నిర్వహించడం ఆనవాయితీగా వచ్చేది. ఈసారి నిర్వహించకపోవడంతోభక్తులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుండే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలకు లోను కాకుండా నందలూరు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, స్కౌట్ సిబ్బంది సేవలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుండి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో టిటిడి వారు విఫలం చెందారని పలువురు భక్తులు ఆరోపించారు. భక్తులకు కనీసం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విఐపి లకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించారని అన్నారు.్న సౌమ్యనాథ అన్నదాన ట్రస్ట్ వద్ద గ్రామ నాయకులు గంటా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. **రైల్వేకోడూరు :**వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుదర్శన్ శర్మ, అర్చకులు మణికంఠ శర్మ భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. క్యూ లైన్ ఏర్పాటు చేసి స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ఆలయ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. వెంకటయ్య యాదవ్‌స్వామి వారికి పూలంకరణ చేపట్టగా,గండా ప్రభాకర్ రెడ్డి, చిట్టెమ్మ కుటుంబ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. **రామాపురం :** మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ పరిధిలోని కంబారాయుని గుట్టపై వెలసిన శ్రీ సత్యనారా యణస్వామి ఆలయంలో చిట్లూరు, హసనాపురం, కుమ్మరపల్లి, బండపల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉన్న శ్రీ అభయ హస్త ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మహిళలు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద శ్రీ షిరిడి సాయి మహిళా డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ వెంకట చలమరెడ్డి అన్నదానం చేయగా, శ్రీ అభయ హస్త ఆంజనేయస్వామి ఆలయంలో కస్తూర్బా బాలికల పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రామాంజనేయమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ముక్కోటి బసిరెడ్డి, రామాంజుల రెడ్డి, భయ్యారెడ్డి, రాజశేఖర్ రెడ్డి. చింతల సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి.ఇందులో భాగంగా స్వామివారి దర్శనానికి ఉదయం నుండే భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి ఆలయ పూజారి చెన్నకేశవులు,చెన్నకేశవ స్వామిని వారికి ప్రత్యేక విశేష పూజలు నిర్వహించి,భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. **చిట్వేలి:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని దేవాలయాలు తెల్లవారుజామునుండే భక్తులతో కిటకిటలాడాయి. ఎంతో పవిత్రంగా భావించే ముక్కోటి ఏకాదశి గ్రామ గ్రామాన భక్తిశ్రద్ధలతో ఉదయం నుండే కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో దేవాలయాల సందర్శించడం జరిగింది ముఖ్యంగా అగ్రహారంలో వెలసి ఉన్న వైకుంఠ వాసుడు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-రామాపురం

మాట్లాడుతున్న ఎపిఎం దేవసేన

మండలంలో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి 70 మంది ఈనారి సభ్యులను నియమించినట్లు వెలుగు ఎపిఎం దేవసేన అన్నారు. మంగళవారం వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి వీరు కృషి చేస్తారని పది సంఘాలకు ఒక్కొక్క ఈనారి సభ్యులను నియమించినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఏ విధంగా పనిచేస్తున్నాయి, వారి బాగోగులను చూసేందుకు,రికార్డును నమోదు చేసేందుకు వీరు సహాయపడతారని ప్రతి ఒక్క ఈనారి సభ్యురాలు విఒ ఎలా పరిధిలో పనిచేస్తారని చెప్పారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించే విధంగా మీరు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా సంఘాలు బలహీనంగా ఉంటే వాటిని తిరిగి పునరుద్ధరింప చేసే బాధ్యత వారిపై ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిసిలు శ్రీనివాసరాజు. రెడ్డిబాబు, గంగాధర, నాగరాజు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు :డిఎఒ

ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎఒ శివనారాయణ

ప్రజాశక్తి - నందలూరు

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించడం జరిగినది. ఈ పర్యటనలో ముందుగా పాటూరు గ్రామంలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వరిపంట సాగు విధానాలను గురించి వివరించారు. రాజంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు మణి మాట్లాడుతూ వరి పంటలో వచ్చే తెగులు, నివారణ గురించి వివరించారు. జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ శ్రీరాములు మాట్లాడుతూ ఎరువుల లభ్యత గురించి, ఎరువుల సమర్థ వినియోగం గురించి తెలిపారు. రైతులు జిల్లా వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ తమకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కావాలని కోరడం జరిగింది. దీని మీద జిల్లా వ్యవసాయ అధికారి స్పందిస్తూ తమ వద్ద తగిన నిలువలు ఉన్నాయని, త్వరలోనే రైతులకు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నందలూరు-2 రైతు సేవా కేంద్రాన్ని, అక్కడ ఉన్న ఎరువుల నిల్వలు గురించి వివరాలు సేకరించారు. తర్వాత ప్రైవేట్ డీలర్స్ దుకాణాలను పరిశీలించి అక్కడ లభ్యమవుతున్న ఎరువులు అమ్ముతున్న విధానాన్ని పరిశీలించి తగిన సూచనలను ప్రైవేటు డీలర్స్ కు అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట టెక్నికల్ అధికారి ఝాన్సీ, మండల వ్యవసాయ అధికారి జి.మల్లికార్జున, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలంలోని మిట్టమానుపల్లె రెవెన్యూ పరిధిలో జనవరి 2 నుంచి ప్రభుత్వం చేపట్టనున్న భూముల రీ సర్వే కార్యక్రమంపై మంగళవారం తహశీల్దార్ రాజసింహా నరేంద్ర రైతులకు అవగాహన కల్పించారు. భూముల రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. రీ సర్వే వివరాలను సచివాలయ నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే నిర్వహిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. భూ సర్వే నిర్వహించి ప్రభుత్వమే గుర్తు రాళ్లను ఏర్పాటు చేస్తుందని, సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి ప్రవీణ్, విఆర్‌ఓ ఓబుల్ రెడ్డి,సర్వేయర్లు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రైతుల పరిస్థితి దయనీయం

ప్రజాశక్తి - వేంపల్లె :చంద్రబాబు పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 సంవత్సరంలో చంద్రబాబు నేతృ త్వంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించలేదన్నారు. ఎరువులు ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బం దులు పడ్డారని తెలిపారు. పంటల బీమా అమలు కాలేదన్నారు. పంట నష్ట పరిహారం అందలేదని విమర్శిం చారు. విద్యుత్ ఛార్జీలు పెంచి వీర బాదుడు బాదారని విమర్శిం చారు. కూటమి ప్రభుత్వం పాలనలో డ్రగ్స్, గంజాయి దుష్ట సంస్కృతి పాఠశాలల్లో కూడా ప్రవేశించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉచిత ఆరోగ్య సంరక్షణ శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో కెసి పుల్లయ్య ఫౌండేషన్ సహకారంతో ఉచిత ఆరోగ్య సంరక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్య శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బందికి రక్తపోటు, మధు మేహం వంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల సమయంలో కొన్ని అసాధారణ ఆరోగ్య పరిస్థితులు గుర్తించిన వ్యక్తులను మరింత చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యా ప్రగతి సాధ్యమ వుతుం దన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు ప్రత్యేకశ్రద్ధ చూపుతుందన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలు భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సహకరించిన కెసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రతి నిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిప్రసాద్, కెసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ గురుబ్రహ్మయ్య, ఆరోగ్య సిబ్బంది, సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ లెక్చరర్ రవికుమార్, లెక్చరర్ నరేంద్ర, విద్యార్థులుపాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి డిగ్రీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె :

గ్రామసభ అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దార్, అధికారులు

కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ సమైక్యత శిబిరానికి వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి లక్ష్మీనరసింహ ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం విద్యార్థి లక్ష్మీనరసింహను కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత శిబిరం హైదరాబాద్‌లోని ఎంఎల్ఆర్ టెక్నాలజీ విద్యాలయంలో జరిగిందన్నారు. శిబిరంలో సామాజిక, పర్యావరణ అంశాలతోపాటు సామాజిక బాధ్యత ఆవశ్యకతపై సమాజంలో అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ ద్వారా వెలిగల్లులోకి చేరుతున్న నీరు

'వెలిగల్లు'కు హంద్రీ-నీవా జలాలు

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు జలాశయానికి 100క్యూసెక్కుల హంద్రీనీవా జలాలు విడుదలైనటు డిఇ భాస్కరరావు పేర్కొన్నారు.వెలిగళ్ళు ప్రాజెక్టులోకి 5టిఎంసిల జలాలు ఇవ్వాలని ఇస్తేనే కుడి ఎడమ కాలువలకు సాగునీరుకి సాగు తాగునీరుకి వీలుంటుందని అప్పట్లోనే ఎస్టిమేషన్ వేశారు. 2008లో ప్రాజెక్టును జాతికి అంకితం చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు హంద్రీనీవా కాలవ నీళ్లు వెలిగేళ్ళు ప్రాజెక్టులో పడలేదు. ఆదివారం రాత్రి నుంచి 100 కుసెక్కుల నీళ్లు వస్తున్నాయి. అనంతపురం నుంచి వెలిచలమల, ఎన్‌పికుంట మీదుగా దిగువపల్లి వద్ద నుంచి ప్రాజెక్టులోకి నీరు చేరుతున్నాయని తెలిపారు. జనవరి చివరి వరకు ప్రాజెక్ట్‌కు వస్తుంటాయని అయన పేర్కొన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా కుడికాలువకు 132 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

మరుగుదొడ్లను తనిఖీ చేస్తున్న డిఇఇ రెడ్డప్ప

రూ.12 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు మదనపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ రెడ్డప్ప అన్నారు. మంగళవారం ఆర్డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తితో కలిసి మండలంలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రముఖ క్షేత్రాలైన శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం, అహోబిలనాయిని చెరువు వద్ద ఉన్న సయ్యద్ షా వలి దర్గా కట్ట వద్ద సుమారు రూ.12 లక్షల రూపాయలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులను చేపట్టామన్నారు. నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం వద్ద రూ.6 లక్షల తో, సయ్యద్ షా వలి దర్గా కట్ట వద్ద రూ.6 లక్షలతో నూతనంగా మరుగుదొడ్లను నిర్మించామన్నారు. ప్రముఖ క్షేత్రాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మించామని, త్వరలోనే వీటిని ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. మండలంలో పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇమిథున్ చక్రవర్తి, గుర్రప్ప పాల్గొన్నారు.

యాత్రికులకు మెడికల్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-గాలివీడు

శబరిమల, తీర్థయాత్రలకు వెళ్లే యాత్రికులకు అమీన్ మెడికల్ స్టోర్ సంస్థ ఉచితంగా మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మండల కేంద్రం నుంచి వెళ్లే భక్తులకు మెడికల్ కిట్లు అందివ్వడం, భోజన వసతి కల్పిం చడం, వారికి మందులు ఉచితంగా మెడికల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అ మీన్ దాతృత్వం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పలువురు కొనియాడారు.

9 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి సంక్రాంతి వేడుకల సందర్భంగా ఎంసిసి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి హార్ట్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్న మెంట్ నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు జనవరి 7లోపు తమ టీంను ఎంట్రీ ఫీజుతో నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు సూచించారు. వివరాలకు 98850 53115, 98850 68818 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రజల నుంచి అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు కోరారు. మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి థామస్ అధ్య క్షతన మంగళవారం మండల సభా భవనంలో నిర్వహించారు. ఈ సం ద ర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పట్ల ప్రజాప్రతి నిధులకు అవగాహన ఉంటుందన్నారు. వారు సమస్యలను సభ దృష్టికి తెస్తే సంబంధిత అధికారులు స్పందిస్తారన్నారు. ప్రజాప్రతినిధుల నుంచి సభ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. ఆర్‌అండ్‌బి రోడ్ల వెంబడి కంపచెట్లు అధికంగా పెరిగి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని వెంటనే తొలగించాలని అన్నలూరు సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, వనిపెంట నుంచి లెక్కలవారిపల్లెకు వెళ్లే మార్గంలో అధిక లోడుతో వెలుతున్న రోడ్డు దెబ్బతిని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ జయభారత్ రెడ్డి సభలో పేర్కొన్నారు. ఎఇ రామకృష్ణారెడ్డి స్పందిస్తూ నిధులు మంజూరు కాగానే బాగు చేస్తామన్నారు. ఇ-క్రాప్ నమోదు చేసుకున్న ఉల్లి పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే రైతుల ఖాతాలో జమ అవుతుందని ఉద్యానశాఖ ఎఇ రామకృష్ణ తెలిపారు. కెసి కెనాల్ ఎఇ గురుమోహన్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. కెసి కెనాల్‌కు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే ఫిబ్రవరి తర్వాత వాటిని గుర్తించి వేసవిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ప్రసన్న లక్ష్మి, పిఆర్ ఎఇ నిరంజన్ రెడ్డి, ఎంఇఒ పద్మలత, కెసి కెనాల్ ఎఇ గురుమోహన్‌రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ భరత్, వ్యవసాయ అధికారి బాలగంగాధర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమయాన్ని హరించవద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాశాఖలో ఉపాధ్యాయులకు యాప్స్ ఎక్కువగా పెడుతూ వారి సమయాన్ని హరించవద్దని బహుజన టీచర్స్ యూనియన్ (బిటియు) ఎపి రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున కోరారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. చక్రాయపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఉపాధ్యాయులకు యాప్స్ ఎక్కువగా పెడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెప్పే సమయాన్ని హరించి వేయడం బాధాకరమన్నారు. ప్రాథమిక స్థాయిలో పాఠ్యాంశాలను చెప్పడంలోను, మాతృభాషలో ఎల్ ఎస్ ఆర్ డబ్ల్యు, గణితంలో చతుర్విధ ప్రక్రియలను విద్యార్థులకు నేర్పించడంలోనూ ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలని పేర్కొన్నారు. తాము చెప్పినట్లే చదువు చెప్పాలని ప్రభుత్వం అనడం ఉపాధ్యాయులలోని సృజనాత్మక శక్తిని దెబ్బతీయటమే అని పేర్కొన్నారు. 10వ తరగతికి స్లిప్ టెస్ట్‌లు పెట్టి, వరుసటి రోజు మార్కులను ఆన్‌లైన్ చేయాలనడం ఉపాధ్యాయులను ఒత్తిడిలోకి నెట్టడమేనని చెప్పారు. సెలవు రోజుల్లో కూడా పాఠశాలకు వెళ్లి పదవ తరగతి విద్యార్థులకు తరగతులు తీసుకోవాలని అనడంతో మహిళా ఉపాధ్యాయులు చాలా బాధలు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులందరూ ప్రజ్ఞాపరంగా ఒకేలా ఉండరని, వారిలో ఉన్న అంతర్గత నైపుణ్యాల మేరకు విద్యార్థులకు బోధన చేస్తారని పేర్కొన్నారు. అలా చేస్తేనే విద్యార్థులు చదువులో స్వేచ్ఛగా రాణిస్తారని, చదువు చెప్పడంలో ఉపాధ్యాయులకు స్వేచ్ఛను ఇవ్వాలని అన్నారు. **చక్రాయపేట మండల కమిటీ ఎన్నిక**.. మండలాధ్యక్షునిగా వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా టి.వి.సి. మనోహర్, కోశాధికారిగా పి.మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, విద్యాభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.సుదర్శన్ బాబు, జిల్లా అధ్యక్షులు ఎం.గంగరాజు, కార్యనిర్వాహక సభ్యులు కె. జయరాముడు, టి.మనోహర్ పి.మురళి పాల్గొన్నారు.